# శ్రీ మన్నారు దేవుని...

## హేమాబ్జ నాయికా స్వయంవరము-పరిశీలన





సరస్వతీ దేవి, రాళ్ళపల్లి

# హేమాబ్జనాయికాభ్యుదయం

డా. జి. అరుణకుమారి
తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం
గచ్చిబౌలి, హైదరాబాద్ - 500 046

17,18 శతాబ్దాలలో తెలుగువారు ఆంధ్రరాష్ట్ర సరిహద్దుల్ని దాటి దేశం కాని దేశంలో దక్షిణాపథంలో ముఖ్యంగా తంజావూరు మధుర రాజ్యాలలో తమదైన స్వంతగొంతును వినిపించి తెలుగు ప్రభను వెలార్చి విశిష్ట శోభతో విలసిల్లారు. ఆంధ్రుల చరిత్రలో నాయక రాజుల యుగం ఒక గర్వకారణం. తెలుగు సాహిత్యానికి అదొక పర్వదినం.

ఏ చరిత్ర చూసినా రాజ్యపతనాలకు గల కారణాలలో ప్రధానమైనవిగా కనిపించేవి మతం, భోగలాలసత, అసమర్థత, యుద్ధాలు, విదేశీయుల ప్రభావం, కుతంత్రం. తంజావూరు నాయక రాజుల్లో రఘునాథ నాయకుడు శ్రీరాముడిని కొలిచినందుకు పండితులు అతడిని శ్రీరామచంద్రుడంతటి వాడన్నారు (రఘునాథాభ్యుదయం), (తంజావూరు విజయం నవల). విజయ రాఘవనాయకుడు శ్రీరాజగోపాలస్వామిని కులదైవంగా కొలిచినందుకు పండితులు అతడిని శ్రీకృష్ణుడి అవతారంగా భావించి రచనలు చేపట్టటమే అతని పరాజయ చరిత్రకు మూలమయ్యింది. విజయరాఘవనాయకుని కుమారుడు మన్నారుదేవుడు శ్రీరాజగోపాల స్వామినే కొలిచినా ఆస్వామిలో విష్ణువుని దర్శించాడు (హేమాబ్జనాయికా స్వయంవరము). కాలంతో పాటు మతంలోనూ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పూర్వులకున్న మతసహనం విజయరాఘవ నాయకునిలో లేకపోవటం, వీరవైష్ణవాన్ని బలపరచటం, భోగలాలసతకు చోటివ్వటం, అంతఃకలహాలు మొదలైనవి తంజావూరు చరిత్రపతనానికి కారణాలయ్యాయి. బుడతకీచులనే పోర్చుగీసు వారి కుతంత్రాలను రాయలనాటి కాలంలోనే కాకుండా, విజయరాఘవ నాయకుడి కాలంలో కూడా అనుసరించి వుండవచ్చు.

పోర్చుగీసు వారి సలహాల ప్రభావంతో

1. కృష్ణరాయలు తిమ్మరసు మీద నేరాన్ని మోపి ఆయన్ని ఆయన కుమారుడ్ని కారాగారంలో పెట్టి కళ్ళు పీకించి చంపించాడు.
2. రామరాయలు అచ్యుతరాయల రాజ్యసంరక్షకుడు. అతడు అచ్యుతరాయలను ఖైదు చేసాడు.
3. విజయరాఘవనాయకుడు మన్నారుదాసును చెరసాలలో బంధిచటానికి ఇది ఒక కారణం కావచ్చు.

తంజావూరు నాయకరాజుల కాలంలో చివరి రాజకవి విజయరాఘవ నాయకుని కుమారుడు మన్నారు దేవుడు. యువరాజుగా తండ్రితో పాటు మహారాష్ట్రులతో పోరాడి వీరమరణం పొందాడు. అతడు రచించిన యక్షగానం 'హేమాబ్జనాయికా స్వయంవరము'. తంజావూరు నాయకులు మన్నారు గోత్రం వారని, దక్షిణ ద్వారకయైన మన్నారు గుడిలో వున్న శ్రీ రాజగోపాలస్వామి వీరి కులదైవమని చరిత్ర చెప్తుంది.

మన్నారుదేవుని జీవిత విశేషాలు చరిత్రదూరమై నిరక్షరాలయ్యాయి. శౌర్యధైర్యాది గుణాలతో విరాజిల్లే మన్నారు దేవుడు 'మహితప్రభువు' అని రంగాజమ్మ ఉషాపరిణయములోనూ, రఘునాథ నాయకుడు రోజుకు వెయ్యి మందికి అన్నదానం చేస్తే విజయ రాఘువుడు అన్నసత్రాలు కట్టించాడని, మన్నారు దేవుడు రోజుకు లక్షమందికి భోజనం పెట్టించేవాడని తంజావురాన్నదాన మహానాటకం భరతవాక్యం వలన తెలుస్తుంది. వాల్మీకిచరిత్ర, పూతనాహరణం, తంజావురాన్నదాన మహానాటకం మొదలైన యక్షగానాల్లో అన్నదాన గ్రహీతల సంఖ్య గురించి భేదాభిప్రాయాలున్నాయి. రాజుల ఘనతను చాటి చెప్పే చరిత్రలు వాస్తవాలను పాక్షిక సత్యాలతో రూపొందించడం కనిపిస్తుంది. వాఙ్మయం చరిత్ర అధ్యయనానికి ఆకరం అని అన్నా ఒక్కొక్కప్పుడు వాస్తవాలకన్నా అతిశయోక్తులనే ఇవి సూచిస్తాయి. 'అతుల కనక తులా ప్రముఖ నిఖిల మహాదాన దీక్షాధురీణుండును, అనేకాగ్రహారప్రతిష్ఠాపనా ప్రవీణుండును విజయరాఘవాభ్యుదయాది ప్రబంధ నిబంధన చాతురీ ధౌరేయుండును, అతులిత పితృభక్తి, గురుభక్తి భాగధేయుండును, మహితానుభావుండును అని స్వయంగా చెప్పుకోవడమే కాకుండా 'మణిగిందు పఱచి జలనిధి తృణమున్ బైనుంచె నతనిదే కొదవ సుమీ, మణిమణియె తృణము తృణమే' నని చెరనుండి విముక్తుడైన వెంటనే మన్నారుదేవుడు తాను మణియంతటి వాడినని తండ్రితో పలికి ఆత్మవిశ్వాసాన్ని చాటుకున్నాడు. వాఙ్మయ ఆధారాల మూలంగా మన్నారు దేవుని వ్యక్తిత్వాన్ని గుర్తించడానికి ఈ ఉదాహరణ ఒక్కటిచాలు.

విజయరాఘువుడు మన్నారు దేవుడ్ని కారాగార బద్ధునిగా చేయడానికి గల కారణాల్ని చరిత్ర పుటలు పేర్కొనలేదు. ప్రేమ వ్యవహారం గాని, రాజకీయ వ్యవహారం గానీ, ఆంతరంగిక వ్యూహం గానీ కారణాలు కావచ్చు. శ్రీనివాస తాతాచార్యుల కుమార్తెను వరించాడని, గోవిందదీక్షితుల కుమార్తెను ప్రేమించాడని, తాను శ్రీ రంగరాయలకు సహాయాన్ని నిరాకరించగా తన వంశీకులు విజయనగర సామ్రాట్టుల పట్ల భక్తి గలవారై ఉన్నారని, మధుర తిరుమల నాయకునికి విజయరాఘవుడు తోడ్పడతానని వాగ్దానం చేసి మాట తప్పాడని, ఇంటి బిడ్డని మధుర నాయక రాజునకు ఇవ్వడానికి నిరాకరించాడని, మతపరమైన విషయాలలో అసహనం పాటించాడని ఈ పై విషయాలపై పుత్రుడైన మన్నారు దేవుడు కలగ జేసుకోవడం కారణాలుగా ఉండి ఉండవచ్చు.

సంగకాలపు సాహిత్యానికి సంబంధించిన కవిత్వ ధోరణులు యక్షగానంలో చోటు చేసుకున్నాయి. అహం నాయికా నాయకుల ప్రేమకు, పుఱం వీరానికి సంబంధించినది. ఇవి ప్రధానంగా రాజు లేదా దైవానికి సంబంధించిన ప్రణయ కావ్యాలు. క్రమేపి ఇవి నాటకీయమైన అంశాలతో కూడిన పద్య ప్రబంధాలుగా ప్రత్యేక కావ్య ప్రక్రియలుగా రూపొందాయి. కుఱవంజి, గిరిజనులకు సంబంధించినవి, వ్యవసాయకూలీలకు సంబంధించినవి, స్వగతం, కపట నాటకం, రాయబారం, వేశ్యల ధన దాహాన్ని వర్ణించే రచనలు చోటు చేసుకున్నాయి. తొంభై ఆరు ప్రబంధాలలో ఉలా ఒకటి. ఉలా అంటే ఊరేగింపు అని అర్థం. ఉత్సవ విగ్రహం ఊరేగింపు మొదలై నగర పర్యటన చేసిన తర్వాత తిరిగి స్వస్థానానికి చేరుకునే లోపల ఏడు సంవత్సరాలు వయసున్న నుండి భిన్న వయో భేదాలు గల వారిలో ఏర్పడే భావాలే ముఖ్యంగా దేవదాసీల... ఏర్పడినవి ఉలా ప్రబంధంలో చోటు చేసుకున్నాయి. నాయిక మోహించటం

విరహం, దౌత్యం, పెళ్ళి మొదలైన అంశాలు కూడా రూపొందాయి. సంగీతసాహిత్య ప్రధానమైన దృశ్య శ్రవ్య రచనలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ విధంగా తెలుగు యక్షగానాలు రూపొందాయి. తెలుగు యక్షగానాలు తమిళంలోనూ అనువదింపబడ్డాయి. ఆళ్వారుల ప్రభావం, ప్రచారంలో ఉన్న కర్ణాటక సంగీత పద్ధతి, దాస సాహిత్యం యక్షగానాలకు తోడయ్యాయి.

తంజావూరు నాయకరాజుల కాలంలో నాయకాభ్యుదయ రచనల ననుసరించి మధురనాయకరాజుల కాలంలో శృంగారరస ప్రధానమైనవి

కళ్యాణాత్మకాలైన యక్షగానాలు వెలిసాయి. ద్రౌపదీ కళ్యాణం, శాంతా కళ్యాణం, వల్లీ కళ్యాణం సీతాకళ్యాణం రతీకళ్యాణం మొదలైనవి. విలాసం, అభ్యుదయం, పరిణయం, కళ్యాణం పేరుతో నాయికా నాయకుల ప్రణయం యక్షగానాలుగా రూపొందాయి. మన్నారు దేవుని హేమాబ్జనాయికాస్వయంవరము కూడా ఈ కోవకు చెందినదే.

విప్రనారాయణ చరిత్రలోనూ, రాజగోపాలవిలాసము లోనూ కనిపించే కొలువుకూటాన్నే హేమాబ్జనాయికాస్వయంవరంలో మన్నారు దేవుడు ప్రవేశ పెట్టాడు. మన్నారు గుడి క్షేత్రంలోని రాజగోపాలస్వామికి క్షీరసాగర పుత్రికయైన చెంగమలా దేవికి, భక్తుడైన విజయరాఘవ నాయకుడు జరిపించిన వివాహమే హేమాబ్జనాయికా స్వయంవరము లోని ఇతివృత్తం. సముద్ర మథనం, అపూర్వ వస్తు ఉద్భవం, కలశాబ్ధి కన్యావిర్భావం, దేవాసుర సంవాదం, దక్షిణ నాయకుడిగా కనిపించే రాజగోపాలుడు విష్ణు మూర్తిగా క్షీరసాగర మథనంలో ఆవిర్భవించిన హేమాబ్జనాయికను వివాహమాడటం మొదలైన అంశాలు ఇందులో ఉన్నాయి.

2

రాళ్ళపల్లి సరస్వతీ దేవి ఎం. ఫిల్ కోసం చేపట్టిన అంశం 'మన్నారు దేవుని హేమాబ్జనాయికా స్వయంవరము - పరిశీలన'. ఈ యక్షగాన పరిష్కర్త శ్రీ విఠలదేవుని సుందరశర్మగారు నాకు గురుతుల్యులు. ఉస్మానియా ప్రాంగణంలోని సురభారతిలో తంజావూరు సరస్వతీమహల్‌లోని అముద్రిత గ్రంథాలను గురించి వివరిస్తూ ఉండేవారు. ఆయుర్వేదం, పుట్టుమచ్చల శాస్త్రం, విమాన నిర్మాణం... మొదలైన అనేక అంశాలను గూర్చి చర్చించేవారు. వారినీవిధంగా స్మరించే అవకాశం కలిగినందుకు సంతోషిస్తున్నాను.

హేమాబ్జనాయికాస్వయంవరము లోని సంవాదాత్మకమైన రచన, పాత్రోచితమైన వ్యవహారిక భాష, హాస్యరసపోషణ, సంగీత ప్రధానమైన దరువులు, పాటలు, మొదలైన వాటి వివరణలు ఈ పరిశోధనలో ఎన్నదగిన విశేషాలు. యక్షగాన నాటక లక్షణాన్వయం లోనూ, రస చర్చలోనూ పరిశోధకురాలి నిశితదృష్టి కనిపిస్తుంది. హాస్య ప్రసంగాలు, రాజాస్థాన మర్యాదలు, శృంగారవర్తనలు, నాటి తంజావూరి సౌభాగ్యాలకు, సామాజిక జీవనానికి నిదర్శనాలని, దరువులు ఏలలు, పదాలు, సంకీర్తనలు, దేశీయ ఛందో రూపాలుగా గ్రంథాలలో ప్రవేశించాయని, నృత్యానికి అనువైనట్టు దేశీయ ఛందస్సులు సాహిత్యంలో వ్యాప్తి లోకి వచ్చాయని వివిధ అంశాలను ఈ పరిశోధన వ్యాసంలో చర్చించారు.

యక్షగానంపై సమగ్రమైన పరిశోధన వ్యాసాన్ని తెలుగు సాహిత్యానికి సమర్పించిన సరస్వతీదేవిని అభినందించి ఆశీర్వదిస్తున్నాను.

- డా. జి. అరుణకుమారి